క్లుప్తంగా

చట్టవిరుద్ధంగా భూ రిజిస్ట్రేషన్ : శివచంద్రం

సిద్దిపేటకమాన్: కోర్టు ఆర్డర్‌కు చట్టవిరుద్ధంగా అధికారులు భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి శివచంద్రం ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ సిద్దిపేట పొన్నాలలో 174, 175, 54, 55 సర్వే నంబర్‌లలో ఉన్న భూమిని అమ్మకూడదన్న కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి చట్టవిరుద్ధంగా సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సాజిద్, మధు, గోపి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



పరిహారం చెక్కు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వర్గల్ మండలం మీనాజీపేటలో కొద్దినెలల క్రితం విద్యుత్‌షాక్‌తో పార్టీ కార్యకర్త నీల యాదగిరి మృతిచెందగా, పార్టీ తరపున రూ. 2 లక్షల బీమా పరిహార చెక్కును శనివారం కుటుంబీకులకు అందజేశారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందన్నారు. స్థానిక ఎన్నికలలో ఓట్ల కోసమే గ్రామసభలు ఏర్పాటు చేసిందని విమర్శించారు. పథకాల అమలులో పేదలు, అర్హులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, నాయకులు దేవగనిక నాగరాజు, కుమార్ యాదవ్, నగేశ్‌పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని 13వ వార్డులో నిర్మించనున్న సీసీ రోడ్లకు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌లు హాజరయ్యారు. పట్టణంలోని 10వ వార్డులోనూ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకియోద్దీన్‌తో కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాల్సిందే

టూటౌన్ సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో సీఐ, పోలీసు సిబ్బంది శనివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీని జిల్లా డివిజన్ ఆఫీసర్ పి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం హుండీ లెక్కించారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు భక్తులు కానుకల ద్వారా రూ,1,50,0418 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అనంతరం కొబ్బరికాయ, ప్రసాదల వేలం పాట నిర్వహించారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవాదాయశాఖ అకౌంట్‌లో జమ చేస్తామని ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు.

వరికి ప్రత్యామ్నాయం మొక్కజొన్న : నగేశ్‌కుమార్

హుస్నాబాద్: వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను వేసుకుంటే రైతులు నికరలాభంతో పాటుగా పంట మార్పిడి జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ మొక్కజొన్న పరిశోధన విభాగ అధిపతి డాక్టర్ నగేశ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో మొక్కజొన్న పంటలో చిరు సంచులపై తోర్నాల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. డీహెచ్‌ఎం 206 హైబ్రిడ్ రకం విత్తనాలతో నీటి ఎద్దడి, ఎండు తెగులను తట్టుకుంటుందన్నారు. వానాకాలం, యాసంగి కాలాలకు అనుకూలమన్నారు. రైతులు అధిక ధరలు ఉన్న ప్రైవేట్ విత్తనాలకు బదులుగా పరిశోధన స్థానం నుంచి వెలువడిన విత్తనాలను వాడుకోవాలని సూచించారు.



గజ్వేల్‌రూరల్: బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో...



వర్గల్: పూలే గురుకుల ప్రాంగణంలో ..



మిరుదొడ్డి(దుబ్బాక): ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



బెజ్జంకి(సిద్దిపేట): కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో...

ఓటు వజ్రాయుధం

ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన ప్రతీపౌరుడు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులతోవ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దుబ్బాక: పట్టణంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మాక్‌పోలింగ్

ములుగు(గజ్వేల్): ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు మాక్‌పోల్ నిర్వహించామని మండల విద్యాధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. ములుగు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం ఉపాధ్యాయులు విద్యార్థులకు నమూనా పోలింగ్ నిర్వహించి ఓటింగ్, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ములుగు: ఉన్నత పాఠశాలలో ఓటు వేస్తున్న విద్యార్థి

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి



మాట్లాడుతున్న సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: ఖైదీలు జైలులో సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. సిద్దిపేట జిల్లా జైలులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన న్యాయమూర్తులు సాయిరమాదేవి, స్వాతిరెడ్డి మాట్లాడుతూ ఏదైనా కేసు విషయంలో మహిళలను రాత్రి సమయంలో అరెస్టు చేయరాదని, ఒకవేళ చేయాల్సి వస్తే మహిళా ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జరగాలని తెలిపారు. ఖైదీలు న్యాయవాదిని పెట్టుకోలేని స్థోమత ఉంటే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నుంచి న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. తమ సమస్యలను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు తెలిపితే వారు న్యాయపరమైన సలహాలు ఇస్తారని తెలిపారు. అన్ని వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ములాఖత్ సమయం ఉంటుందన్నారు. బంధువులకు ఉత్తరాలు రాసుకునే హక్కు ఉందన్నారు. 21 ఏళ్ల లోపు వారు నేరం చేసి జైలుకు వస్తే వారిని జేజేబీలో ఉంచాలని తెలిపారు. బాలయ్య, జైలు సూపరింటెండెంట్ వికాస్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాలకవర్గం పదవీకాలం



మాట్లాడుతున్న చైర్మన్ రాజమౌళి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం శనివారంతో ముగిసింది. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన చివరి సమావేశంలో కౌన్సిల్ సభ్యులు 7వ అంశాలకు ఆమోదం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల పాలనలో గజ్వేల్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇందులో భాగస్వామ్యులైన కౌన్సిలర్లతో పాటు సహకరించిన అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వీడ్కోలు సభలో చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకీయోద్దీన్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులను సన్మానించారు.

క్రీడా దుస్తుల అందజేత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి ప్రాథమిక విద్యార్థులకు ఉపాధ్యాయురాలు అశ్విని శనివారం క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమానికి ఎంఈఓ బచ్చలి సత్తయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యం నేర్పడంతో పాటు అందుకు అవసరపడే వస్తుసామగ్రిలను అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూసుకునే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులది అని అన్నారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం



చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు



చేతికందే ఎత్తులో ప్రమాదం పొంచి ఉంది. అక్కన్నపేట మండల కేంద్రంలోని కందుల రాంరెడ్డి, కర్ణకంటి శ్రీశైలం ఇంటి నుంచి చౌరస్తా రోడ్డు వరకు కరెంట్ తీగలు వేలాడుతున్నాయి. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి వాటిని సరి చేయాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

బస్సు పునరుద్ధరణ



మడదలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

హుస్నాబాద్ మండలం మడద, బంటుపల్లి, ఉల్లంపల్లి వయా కరీంనగర్‌కు శనివారం బస్సు సర్వీసు పునరుద్ధరించారు. దాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఇటీవల ఈ విషయమై గ్రామస్తులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడానికి బస్సును కల్పించినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు.

– హుస్నాబాద్‌రూరల్

ప్రజాస్వామ్యంలో ఓటుకు విశిష్ట స్థానం



బ్యాలెట్ నమూనా చూపిస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజాస్వామ్యంలో ఓటుకు విశిష్ట స్థానం ఉందని మెరీడియన్ పాఠశాల నిర్వాహకులు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఎలక్షన్ నమూనా ప్రక్రియను శనివారం నిర్వహించారు. ఇందులో భాగస్వాములయ్యే రెవెన్యూ, పోలీసులు తదితర అధికారుల పాత్రలను విద్యార్థులు నిర్వర్తించారు. రాజకీయ పార్టీల చిహ్నాలు, నామినేషన్ ప్రక్రియ లాంటి వాటితో పాటు, విద్యార్థులంతా తమ ఐడీ కార్డులను ప్రదర్శిస్తూ ఓట్లు వేశారు. ముందుగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిబంధనలు పాటించాలి**

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సిబ్బందితో కలిసి వాహనదారులు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడారు. త్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ను వెంట బెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవు**

వర్గల్(గజ్వేల్): రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం గౌరారం ఆటోస్టాండ్ వద్ద డ్రైవర్లకు, యువకులకు, వాహనదారులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం, సీటుబెల్ట్ ప్రాధాన్యత, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్‌స్పీడ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ తదితర అంశాల గురించి తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

◆ **ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై ఫిర్యాదు**

హుస్నాబాద్: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. శనివారం ఎస్సై మహేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అవమానించడమే కాకుండా దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సనత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కూన విశ్వతేజ్, నాయకులు రాకేశ్ గౌడ్, రంజిత్, అజయ్, రమణ, ఆదిత్య తదితరులు ఉన్నారు.

◆ **'పాత పెన్షన్'ను అమలు చేయాల్సిందే**

కొండపాక(గజ్వేల్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్(పాత పెన్షన్ విధానం)ను అమలు చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ రూపొందించిన క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆయన కొండపాకలో ఉన్న హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు.